
సాక్షి
కర్నూలు

ఆదివారం । 25 । మే । 2025



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై శనివారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన కృష్ణబీ. బృందం, తణిసంద్ర వారి భరత నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



మద్దిలేటయ్య కిటకిట

బేతంచెర్ల: మద్దిలేటయ్య క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. వేసవి సెలవులు కావడంతో వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,589.57
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 10.712
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 3,897
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 2,123

న్యూస్‌రీల్

పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవు

● 20 మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు



భాస్కర్, జిల్లా పంచాయతీ అధికారి

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం లోపిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల మూడవ వారంలో ఇంటింటి చెత్త సేకరణకు సంబంధించి నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో జిల్లాలోని 20 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉన్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేశారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా పంచాయతీల కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. తాగునీటి పైప్‌లైన్లు ఎక్కడైనా పాడైపోయి ఉంటే వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమన్వయంతో ఆయా పైప్‌లైన్లను బాగు చేయించి రక్షిత నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

జూన్ 1 నుంచి రేషన్ షాపుల్లోనే సరుకులు



రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల్లోనే బియ్యం, బ్యాళ్లు, చక్కెర ఇతర సరుకులను పంపిణీ చేయాలని జేసీ డాక్టర్ బి.నవ్య డీలర్లను ఆదేశించారు. శనివారం ఆమె జి.సింగవరం, కల్లూరులోని రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి ఎండీయూ వాహనాల ద్వారా కాకుండా రేషన్‌షాపుల్లోనే సరుకులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు మాత్రమే డోర్ డెలివరీ చేయిస్తామన్నారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు షాపుల్లోనే ఈపాస్ మిషన్ల ద్వారా సరుకులు పంపిణీ చేయాలన్నారు. జేసీ వెంట కర్నూలు రూరల్ తహసీల్దార్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలసిన కలెక్టర్



హైకోర్టు జడ్జి కె.శ్రీనివాసరెడ్డికి బొకేను అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కర్నూలు వచ్చిన హైకోర్టు జడ్జి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డిని కలెక్టర్ రంజిత్‌బాషా మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ఆతిథి గృహంలో ఉన్న జడ్జిని కలెక్టర్ కలసి పుష్పగుచ్ఛం అందజేసి జిల్లా పరిస్థితులను వివరించారు.

16 మంది డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్న పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన సెమిస్టర్ పరీక్షలకు 1,181 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 10,775 మందికి 9,616 మంది హాజరు కాగా 1,159 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ సెమిస్టర్ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు 207 మందికి 185 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. చూచిరాతలకు పాల్పడిన 16 మంది విద్యార్థులను గుర్తించి డిబార్ చేసినట్లు పేర్కొన్నారు.

సీలింగ్ ఎత్తివేయాలి

కర్నూలు సిటీ:ఉపాధ్యాయుల బదిలీల్లో స్టేషన్ పాయింట్స్‌పై ఉన్న సీలింగ్‌ను ఎత్తివేయాలని ఏపీటీఎఫ్(257) ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈఓ ఎస్.శామ్యూల్‌పాల్‌ను కలిసి విన్నవించారు. 2014 డీఎస్సీ ఉపాధ్యాయులు కౌతాళం, కోసిగి, హొళగుంద మండలాల్లో సుమారు తొమ్మిది సంవత్సరాలుగా పని చేస్తున్నారన్నారు. అయితే ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రస్తుతం దరఖాస్తు చేసుకుంటే స్టేషన్ పాయింట్లు ఎనిమిది సంవత్సరాలకే కేటాయించడం వల్ల తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఈఓను కలసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న, సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నెట్టింటి వైద్యం.. రెట్టింపు రోగం!



☛ కర్నూలుకు చెందిన రాజ్‌కుమార్ ఓ ప్రైవేటు సంస్థలో ఎగ్జిక్యూటివ్. రోజూ వందల కిలోమీటర్లు తిరగడంతో అతనికి ఏదో ఒక అనారోగ్య సమస్య వేధిస్తుంటుంది. దీంతో తరచూ డాక్టర్ వద్దకు వెళ్లడం దేనికని ఆన్‌లైన్‌లో తనకు వచ్చిన ఆరోగ్య సమస్యకు పరిష్కారాన్ని వెతికి మెడికల్ షాపులో మందులు కొని వాడుతున్నాడు. ఓ రోజు మందులు వికటించి ఆసుపత్రికి వెళితే ఎలా పడితే అలా మందులు వాడకూడదని వైద్యులు చికిత్స చేసి పంపించారు.



☛ కర్నూలుకు చెందిన ఓ బి.ఫార్మసి విద్యార్థిని తనకు ఇటీవల ఛాతీలో నొప్పి ఉంటే ఆన్‌లైన్‌లో టైప్ చేసి చూసుకుంటే హార్ట్ ఎటాక్ అని చూపించింది. దీంతో ఆమె తీవ్ర ఆందోళనతో సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి వైద్యులను కలిసింది. పరీక్షించిన వైద్యులు వచ్చింది హార్ట్ ఎటాక్ కాదని, కండరాల నొప్పిగా నిర్ధారించారు.



☛ నంద్యాలకు చెందిన రామాంజనేయులు ప్రభుత్వ ఉద్యోగి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూర్చుని పని చేయాల్సిందే. ఇంటర్‌నెట్‌పై మంచి పట్టు ఉంది. దీంతో తనతో పాటు ఇంట్లో ఎవరికి అనారోగ్య సమస్యలువచ్చినా ఆన్‌లైన్‌లో వెతికి పరిష్కారం కనుగొనే ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమంలో ఆయన తల్లికి ఒకసారి మందులు వికటించి ఇబ్బంది రావడంతో వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. ఆన్‌లైన్ పరిష్కారం ప్రతిసారీ మంచిది కాదని వైద్యులు హితవు పలికారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో చాలా మంది ఇప్పుడు ఆన్‌లైన్‌లో వైద్యం గురించి ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా ఏఐ, చాట్ జీపీటీ లాంటి సైట్లలో ఏ విషయం అడిగినా ఒక్క క్షణంలోనే సమాచారం వస్తోంది. వాటినే నమ్మి వైద్యులను అనుమానించే వారూ ఎక్కువయ్యారు. ఫలానా వైద్యుడు తమను మోసం చేసేందుకు ఇలా చెప్పాడేమోనని భ్రమపడుతున్నారు.

వైద్యసేవలకు ఆన్‌లైన్ శోధన

- మందులు తెలుసుకొని సొంత వైద్యం
- వైద్యుల వద్దకు వెళ్లినా రాసిచ్చిన మందులపై అనుమానం
- మంచివో.. కాదోనని ఇంటర్‌నెట్‌లో తెలుసుకునే ప్రయత్నం
- సోషల్ మీడియా కథనాలను అనుసరిస్తున్న వైనం
- తెలిసీ తెలియని వైద్యంతో అవస్థలు

కర్నూలు(హాస్పిటల్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 3వేల దాకా రిటైల్ మెడికల్ షాపులు, ఏజెన్సీలు ఉన్నాయి. దీంతో పాటు 12వేల దాకా ఎంబీబీఎస్, స్పెషాలిటీ, సూపర్‌స్పెషాలిటీ కోర్సులు అభ్యసించిన వైద్యులూ ఉన్నారు. వీరితో పాటు వైద్యవిద్యను అభ్యసిస్తున్న వారు మరో 3వేల మంది దాకా ఉంటారు. ఇక ఫార్మాసిస్టులు, నర్సులు, ఏఎన్ఎంలు, ఆర్ఎంపీలు మరో 15వేల దాకా ఉంటారు. వీరందరూ అల్లోపతి వైద్యంపై ఆధారపడి రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు వచ్చిన ప్రజలు వీరిలో ఎవరో ఒకరిని సంప్రదించి అవసరమైన చికిత్స తీసుకుంటున్నారు. ఇటీవల ఇంటర్‌నెట్ సదుపాయం అందరికీ అందుబాటులోకి రావడం, విద్యావంతులు పెరగడం, ముఖ్యంగా సాఫ్ట్‌వేర్, ఇంటర్‌నెట్‌పై యువతకు పట్టు రావడం వంటి విషయాల కారణంగా ఆన్‌లైన్‌లో తమకు వచ్చిన ఆరోగ్య సమస్యలకు పరిష్కారాన్ని వెతకడం అధికమైంది. క్షణాల్లో వచ్చే సమాచారం ఆధారంగా తమకు ఈ కారణంగానే ఆరోగ్య సమస్య వచ్చిందని భావించి మెడికల్ షాపులకు వెళ్లి మందులు తీసుకుని వాడే వారి సంఖ్య ఇటీవల పెరుగుతోంది.



భౌతికంగా పరీక్షిస్తేనే..

మంచి పేరున్న వైద్యుని వద్దకు వందల కిలో మీటర్లు ప్రయాణించి రోగులు చికిత్స కోసం వెళ్తుంటారు. అలా వెళ్లిన వారు అవసరమైతే గంటల తరబడి క్యూలో ఉండి చికిత్స తీసుకుని వెళ్తుంటారు. ఫలానా డాక్టర్ చేయి తగిలితేనే(హస్తవాసి) సగం రోగం నయం అవుతుందన్న నమ్మకంతో ఉన్న వారూ ఉన్నారు. ఈ నమ్మకంతోనే ఇప్పటికీ చాలా మంది వారికి ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా నమ్ముకున్న వైద్యుల వద్దే చికిత్స తీసుకుంటారు. సదరు డాక్టర్ భౌతికంగా రోగిని పరిశీలించడమే గాక వారి యోగక్షేమాలు అడగడం, నవ్వుతూ మాట్లాడటం, ఏమీ కాదులే అని ధైర్యం చెప్పడంతో వారికి సగం రోగం నయమవుతుంది. కొందరు సీనియర్ వైద్యులు ఇప్పటికీ రోగిని భౌతికంగా ముట్టుకుని చేతులు, కాళ్లు కదిపి, పొట్టను ఒత్తి చూసి, నాడి పట్టుకుని పరీక్షించి వైద్యం చేస్తుంటారు. ఇలాంటివన్నీ ఆన్‌లైన్‌లో లభించవని పెద్దలు చెబుతుంటారు. ఎంతగా ఆన్‌లైన్ సేవలు అభివృద్ధిలోకి వచ్చినా మనిషిని చూసి వైద్యం ఇచ్చి ధైర్యం చెబితేనే తగ్గుతుందని వారు భావిస్తున్నారు.

ఇవీ నష్టాలు..

➡ ఆరోగ్య సమస్య కొంతైతే ఆన్‌లైన్‌లో వివరాలు కొండంత ఉంటాయి. దానిని చూసి రోగి మరింత ఆందోళనకు గురవుతారు. ఫలితంగా మానసికంగా మరింత కృంగిపోతాడు.

➡ ఆందోళనకు గురైతే శారీరకంగా మరిన్ని ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

➡ కొందరు ఆన్‌లైన్‌లో తమ ఆరోగ్య సమస్యలు వెతికి ముందుగానే అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకుని డాక్టర్ వద్దకు వెళ్తున్నారు. ముందుగానే పరీక్షలు చేయించుకోవద్దని వైద్యులు చెబుతున్నారు.

➡ ఒక్కో వ్యక్తికీ ఒక్కో శరీరతత్వం ఉంటుంది. వారి జన్యువులు, వారి ఆరోగ్యాన్ని బట్టి రోగ లక్షణాలు ఉంటాయి. అందరినీ ఒకే విధంగా చూడలేమని వైద్యులు చెబుతున్నారు. ఒక్కొక్కరికీ ఒక్కో విధమైన చికిత్స ఉంటుందని, ఆన్‌లైన్ వైద్యాన్ని గుడ్డిగా నమ్మొద్దని సూచిస్తున్నారు.

కచ్చితమైన సమాచారం ఉండదు



సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే వారు, యువతలో ఎక్కువగా ఆన్‌లైన్‌లో ఆరోగ్య విషయాలు బ్రౌజ్ చేయడం చేస్తుంటారు. నెట్‌లో కొన్ని నమ్మకమైన వెబ్‌సైట్లు, యాప్స్ మినహా అన్నింటిలోనూ కచ్చితమైన సమాచారం ఉండదు. కచ్చితత్వంలేని సమాచారాన్ని చదివితే మనసు మరింత ఆందోళనకు గురవుతుంది. ఆరోగ్య సమస్యల వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. అంతేగానీ ప్రతి విషయానికీ ఆన్‌లైన్‌పై ఆధారపడటం మంచిది కాదు.

–డాక్టర్ ఎస్.నాగేశ్వరరావు, హెచ్‌ఓడీ, సైకియాట్రి విభాగం, జీజీహెచ్, కర్నూలు

వైద్యులను నేరుగా సంప్రదించాలి



ఇటీవల ప్రజలు తమ ఆరోగ్య సమస్యలను ముందుగా ఆన్‌లైన్‌లో వెతకడం ఎక్కువైంది. అందులో వచ్చిన సమాచారాన్ని చూసి మరింత ఆందోళనకు గురై మా వద్దకు వస్తున్నారు. కొందరైతే ఆన్‌లైన్‌లో వెతికి అందుకు అనుగుణంగా అన్ని రకాల పరీక్షలు చేయించుకుని వస్తున్నారు. టెస్టుల్లో కొన్ని అబ్‌నార్మల్ చూపిస్తాయి. వాటిని చూసి టెన్షన్ పడుతుంటారు. కొన్ని అబ్‌నార్మల్ ఉన్నా ఎలాంటి లక్షణాలు లేకపోతే ఏమీ కాదు. ఆన్‌లైన్ వైద్యాన్ని నమ్ముకోకుండా వైద్యులను నేరుగా సంప్రదించి చికిత్స తీసుకుంటేనే మంచి ఫలితాలు ఉంటాయి.

–డాక్టర్ మీనుగ శ్రీనివాసులు, జనరల్ ఫిజీషియన్, జీజీహెచ్, కర్నూలు

రైల్వే ప్రాజెక్టుల భూసేకరణ త్వరగా పూర్తి చేయాలి

● కలెక్టర్ రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మూడు రెవెన్యూ డివిజన్లలో జరుగుతున్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ పురోగతిపై ఆర్‌డీఓలు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..రైల్వే బ్రిడ్జిలకు సంబంధించిన ప్రాజెక్టుల భూసేకరణను ముందుగా పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం జేసీ, సబ్ కలెక్టర్, ఆర్‌డీఓలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ల్యాండ్ అక్విటేషన్, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు, లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీలపై త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదోని డివిజన్‌లో మూడు ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి భూసేకరణ జరుగుతున్నట్లు సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. కర్నూలు డివిజన్‌లో 12 గ్రామాల్లో డబుల్ ట్రాక్ లైన్, రోడ్డు అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు సంబంధించిన భూసేకరణ పురోగతిలో ఉన్నట్లు కర్నూలు ఆర్‌డీఓ సందీప్ కుమార్ వెల్లడించారు. పత్తికొండ డివిజన్‌లో రెండు ప్రాజెక్టులకు సంబంధించి డబుల్ ట్రాక్ కోసం ల్యాండ్ అక్విజిషన్ పూర్తి అయిందని, మరో ప్రాజెక్టుకు సంబంధించి అవార్డు స్టేజ్ వరకు వచ్చినట్లు ఆర్‌డీఓ భరత్‌నాయక్ చెప్పారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ఈఈ బాబు, ఆదోని ఈఈ వెంకటేశ్వర్లు, రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీరు దుర్గారావు, ఆదోని మునిసిపల్ కమిషనర్ కృష్ణ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి



నాగలదిన్నెలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

నందవరం/గోనెగండ్ల: వివిధ దశలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలని హౌసింగ్ పీడీ చిరంజీవి ఆదేశించారు. శనివారం నాగలదిన్నె, హాలహర్వి గ్రామాల్లో వివిధ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పీడీ పరిశీలించారు. అనంతరం హౌసింగ్ లబ్ధిదారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో 192 ఇళ్లు వివిధ దశల్లో పెండింగ్ ఉన్నాయని, అందులో 82 గృహలు పూర్తి చేశారని, మిగిలినవి బీఎల్, ఎల్ఎల్, ఆర్ఎల్, ఆర్సీ లెవల్ ఉన్నాయని వివరించారు. వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే థర్డ్ పార్టీ నిర్మించిన ఇళ్లను కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. వివిధ దశలో పూర్తి నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లు చెల్లిస్తామని తెలిపారు. అలాగే గోనెగండ్ల మండలంలోని కులుమాల, హెచ్. కైరవాడి, చిన్న నేలటూరు, అలువాల గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓలు పుల్లయ్య, మణిమంజరి, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఏఈలు వెంకటేష్, షేక్షావలి, డిప్యూటీ ఎంపీడీఓ సందీప్ ఉన్నారు.

ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

కర్నూలు: కర్నూలు ఏపీఎస్పీ రెండో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. క్రమశిక్షణ ఉల్లంఘన కింద హెడ్ కానిస్టేబుల్ ఓంకార్ నాయక్ (హెచ్‌సీ నెం.1003), కానిస్టేబుళ్లు బి.రాజశేఖర్ (పీసీ నెం.1028), ఎస్‌కే సిరాజుద్దీన్ (పీసీ నెం.1354)లను సస్పెండ్ చేస్తూ ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఇన్‌చార్జిగా ఉన్న ఆర్ఎస్ఐ రమేష్‌కు చార్జిమెమో జారీ చేశారు. ప్రతి మూడు మాసాలకోసారి టర్న్ ప్రకారం ఏపీఎస్పీ కర్నూలు బెటాలియన్ సిబ్బంది తిరుమలలో బందోబస్తు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా బందోబస్తు విధుల్లో ఉన్న ఓంకార్ నాయక్, రాజశేఖర్, సిరాజుద్దీన్ కలసి ఇన్‌చార్జి ఆఫీసర్‌కు తెలియకుండా ప్రభుత్వ వాహనాన్ని తీసుకుని తిరుమల నుంచి తిరుపతికి వెళ్లి మద్యం సేవించి తిరిగి తిరుమల కొండపైకి వచ్చేటప్పుడు ఘాట్ రోడ్‌లో ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొట్టడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. బ్రీత్ ఎనలైజర్ సాయంతో వారికి టెస్టులు నిర్వహించగా ఆల్కహాల్ స్థాయి 300 పాయింట్లకు పైగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో వీరు ముగ్గురిపై బెటాలియన్ కమాండెంట్ సస్పెన్షన్ వేటు వేశారు. సిరాజుద్దీన్ గతంలో కూడా తెలంగాణ నుంచి బెటాలియన్‌లోకి మద్యం తీసుకుని వస్తుండగా గేటు వద్ద బందోబస్తు విధుల్లో ఉన్న సిబ్బంది గుర్తించి ఎక్సైజ్ అధికారులకు అప్పగించారు. అప్పట్లో కూడా ఇతనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడం గమనార్హం.

స్వచ్ఛందంగా దాహం తీర్చుతూ..



పెద్దమరివీడులో ట్యాంకర్ వద్ద మంచినీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

గోనెగండ్ల: తీవ్ర తాగునీటి సమస్య నెలకొన్న పెద్దమరివీడు ప్రజల దాహార్తి తీర్చడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామంలో ఐదు రోజులకు ఒకసారి కుళాయిలకు నీరు వస్తున్నందున తాగునీటి సమస్య తీవ్రమయింది. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె పెద్దమరివీడు గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మంచినీటి ట్యాంకర్‌ను ఏర్పాటు చేసి గ్రామస్తులకు నీటిని సరఫరా చేపట్టారు. దీంతో గ్రామ ఉప సర్పంచ్ నరసన్న ఆచారి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేష్, చిన్న యంకన్న గౌడ్, గజేంద్ర, నరసింహుడు, గ్రామస్తులు బుట్టా ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అయోమయం

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు మార్గదర్శకాలు విడుదల చేసిన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల విషయంలో అయోమయం నెలకొంది. సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు గత ఏడాది బదిలీలు చేపట్టారు. ప్రస్తుత సాధారణ బదిలీల్లోనూ వీరికి కూడా స్థానచలనం ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని పలువురు ఎంపీడీఓలు తమ పరిధిలో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగుల వివరాలను కోరుతున్న నేపథ్యంలో ఈ ప్రచారానికి బలం చేకూరుతోంది. అయితే ఉద్యోగుల రేషనలైజేషన్ ప్రక్రియ కొనసాగుతున్నందున ఇప్పట్లో సచివాలయ ఉద్యోగుల బదిలీలు చేపట్టబోమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గ్రామ/వార్డు సచివాలయాల మంత్రి డోలా వీరాంజనేయస్వామి ఈ నెల 21న ప్రకటించారు. రేషనలైజేషన్‌లో సిబ్బందిని సర్దుబాటు చేసిన తర్వాత బదిలీల ప్రక్రియ చేపడతామన్నారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి ఇంకా విడుదల కానట్లు తెలుస్తోంది. కాగా పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి డిప్యూటీ ఎంపీడీఓ, గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తమ బదిలీలకు సంబంధించిన దరఖాస్తులను ఈనెల 27 లోగా పంపాలని కోరారు. దీంతో సచివాలయాల్లోని గ్రేడ్-5, 6 కార్యదర్శుల్లో అయోమయం నెలకొంది.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కా ర వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సున యన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవచ్చన్నారు.

క్లుప్తంగా

కార్మికుల వినూత్న నిరసన



మెడకు ఉరితో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: గూడూరులో నగర పంచాయతీ కార్మికులు మెడకు ఉరిగి తగిలించుకుని వినూత్న రీతిలో శనివారం ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారంలో భాగంగా వారం రోజుల నుంచి గూడూరు నగర పంచాయతీ కార్మికులు విధులను బహిష్కరించి దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా కార్మికులు అరవింద్, మధు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా ప్రభుత్వం తమను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. చాలీచాలని జీతాలతో ఏళ్ల తరబడి దుర్భర జీవితాలు అనుభవిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి 15 ఏళ్లకు పైబడి పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు, నెలనెలా జీతాలు సక్రమంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కార్మికులు అల్లిబాషా, దూకేశ్వరరావు, షబ్బీర్ బాషా, ఆంజనేయులు, బసవరాజు, జయన్న, ఖాజాహుసేన్, ప్రభాకర్, ఉసేన్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కోవెలకుంట్ల: స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌కు చెందిన యువకుడు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలు.. ఎల్ఎం కాంపౌండ్‌కు చెందిన రమేష్(36) కూలి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. పిల్లలకు కొత్త దుస్తులు తీసుకొచ్చే విషయంలో శుక్రవారం రాత్రి భార్య, భర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీనికి తోడు కొంత కాలం నుంచి రమేష్ క్షయవ్యాధితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి చుట్టుపక్కల వారి సాయంతో తలుపు బద్దలు కొట్టి ఫ్యాన్‌కు వేలాడుతున్న రమేష్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుని భార్య సుధారాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ఎం.రవి(ఫైల్)

గోనెగండ్ల: మండల పరిధిలోని చిన్న మరివీడు గ్రామానికి చెందిన ఎం.రవి(32) విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. సీఐ విజయ భాస్కర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రవికు భార్య రోజా ఉంది. వీరు గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రవి ఇటీవల కొత్త ఇల్లు కట్టుకుంటున్నాడు. గురువారం కొత్త ఇంటికి స్లాబ్ వేశారు. శుక్రవారం అర్ధరాత్రి ఆ ఇంట్లో కరెంట్ పడడం లేదని రవి పరిశీలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రోజా ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కొత్త ఇల్లు నిర్మాణం చేపట్టి గృహప్రవేశం చేయకుండానే రవి మృతి చెందడంతో భార్య, బంధువులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.



పనులకు బయలుదేరుతున్న మహిళలు



పొలంలో వ్యర్థాలను తొలగిస్తున్న కూలీలు



పొలానికి ఎరువు తీసుకెళ్తున్న అన్నదాత

వ్యవసాయ 'పరీక్ష'

ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు అన్నదాత ఖరీఫ్ పరీక్షకు సంసిద్ధమయ్యాడు. కొందరు రైతులు సాగు వ్యర్థాలను తొలగించుకుంటుండగా.. మరికొందరు భూముల ను దుక్కిదున్నుతున్నారు. ఇంకొందరు రైతులు ముందస్తు విత్తనం వేసే పనిలో నిమగ్నమయ్యారు. వీళ్లందరు కూడా అధిక దిగుబడులనే ఫలితాలు రాబట్టేందుకు రెక్కల కష్టంతో పరీక్ష రాస్తున్నారు. కర్నూలు మండలంలోని ఎదురూరు, తొలిశాపురం, ఆర్.కొంతలపాడు, నిడ్జూరు, సింగవరం గ్రామాల పరిధిలోని రైతులు తమ పనుల్లో నిమగ్నమై ఉండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



దుక్కిదున్నుతున్న రైతు



విత్తనం వేస్తున్న దృశ్యం

ఆర్ఎంపీలు స్కానింగ్‌కు రెఫర్ చేయొద్దు

కర్నూలు(హాస్పిటల్): గర్భిణిలకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయాలని ఆర్ఎంపీలు రెఫర్ చేయవద్దని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గర్భిణిలలో పిండం పెరుగుదల, జన్యుపరమైన వ్యాధులు, అంగవైకల్యం తదితర వాటిని గుర్తించేందుకు అర్హత కలిగిన వైద్యులు మాత్రమే అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం రెఫర్ చేయవచ్చన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఆర్ఎంపీలు గర్భిణిలను స్కానింగ్ కోసం రెఫర్ చేయరాదని హెచ్చరించారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో బదిలీల ప్రక్రియ



బదిలీల ప్రక్రియలో పర్యవేక్షణ ఇంజినీర్లు

కర్నూలు (అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలను విడుదల చేసిన నేపథ్యంలో జోన్ ఫోర్ పరిధిలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ల బదిలీలను శనివారం చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ సీఈ హరేరామ్ నాయక్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ బదిలీల ప్రక్రియకు ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన పర్యవేక్షణ ఇంజినీర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్నూలు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ బదిలీలకు అర్హులైన జోన్ ఫోర్ పరిధిలో 8 మంది డీఈఈలు, 34 మంది సెక్షన్ ఆఫీసర్లకు బదిలీల ప్రతిపాదనలను ఈఎన్సీ కార్యాలయానికి పంపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఒకే ప్రాంతంలో ఐదేళ్లు పూర్తయిన వారు బదిలీ కానున్నారని తెలిపారు.

విజిలెన్స్ అధికారుల సోదాలు

- ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి ఫుడ్ సప్లై సిబ్బందిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: విజిలెన్స్ అధికారులు శనివారం పట్టణంలో సోదాలు నిర్వహించారు. రైతు బజారులోని మూడు కిరాణాషాపుల్లో ఎటువంటి లైసెన్సులు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు జిల్లా సివిల్ సప్లై అధికారి రాజారఘువీర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫుడ్ సప్లై చేస్తున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు. అంతకుముందు వ్యవసాయ మార్కెట్‌యార్డులో వేరుశనగకాయల దిగుబడులను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. తూకాల్లో ఏవైనా మోసాలు జరుగుతున్నాయా, పట్టీలు ఎక్కువ తక్కువ వేస్తున్నారా అనే విషయాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని వంటశాలను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంలో వంట చేయడం, కోడిగుడ్ల సైజు చిన్నగా ఉండటంతో కేసు నమోదు చేశారు. రైతు బజారులోని లైసెన్స్ లేని మూడు కిరాణాషాపులపై కేసు నమోదు చేశారు. పెట్రోల్ బంకును తనిఖీ చేసి, టాయిలెట్లు సరిగాలేవని, వాహనాలకు ఉచితంగా గాలి పట్టే సౌకర్యం ఏర్పాటు లేదని గుర్తించారు. అనంతరం వాటర్ ప్లాంటును పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి లీటర్ బాటిళ్లు బిల్లులు లేకుండా సరఫరా అవుతుండటం, వాటర్ ప్యాకెట్లపై సీల్ లేకుండా ఉండడంపై ఆరా తీశారు. అనంతరం జిల్లా సివిల్ సప్లై అధికారి రాజారఘువీర్ మాట్లాడుతూ కర్నూలు, ఆదోనిలో తనిఖీలు నిర్వహించామన్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. తనిఖీల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారి రాజగోపాల్, అసిస్టెంట్ మార్కెట్‌యార్డు డైరెక్టర్ నారాయణమూర్తి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సత్యవతి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ అధికారి శ్రీరాములు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సందీప్, కన్జూమర్ ప్రొటెక్షన్ సెక్రటరీ శివమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



మార్కెట్‌యార్డులో వేరుశనగ కాయలను పరిశీలిస్తున్న అధికారులు

కోలుకోలేక ఉపాధి కూలీ మృతి



అనసూయమ్మ (ఫైల్)

కృష్ణగిరి: మండలంలోని అమకతాడు గ్రామానికి చెందిన ఉపాధి కూలీ మానుకింది అనసూయమ్మ (42) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందింది. ఈసీ మధు తెలిపిన వివరాలు.. శుక్రవారం గ్రామ సమీపంలో కాలువ వద్ద జరుగుతున్న ఉపాధి పనులకు హాజరైన అనసూయమ్మ పనిచేస్తూ తీవ్ర అస్వస్థతకు గురైంది. హుటాహుటిన కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా అదే రోజు రాత్రి ఫిట్స్ రావడంతో కోలుకోలేక మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త రామాంజనేయులు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతురాలికి ప్రభుత్వం ద్వారా వచ్చే సహాయ సహకారాలకు సిఫారసు చేసినట్లు ఈసీ తెలిపారు.

కొండచిలువ కలకలం



ఉపాధిహామీ పనికి వెళ్లిన కూలీలు శనివారం మట్టి పనులు చేస్తుండగా సమీపంలో కొండచిలువ కనిపించింది. భయంతో వారంతా పరుగులు పెట్టారు. కొందరు వ్యక్తులు ధైర్యం చేసి చంపేశారు. గ్రామ సమీపంలో కుందూనది ఉండటంతో పొలాల్లోకి వచ్చి ఉంటుందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

– బండి ఆత్మకూరు

కర్ణాటక మద్యం ధ్వంసం



మద్యం, నాటుసారాను ధ్వంసం చేస్తున్న కోడుమూరు ఎక్సైజ్ పోలీసులు

కోడుమూరు రూరల్: కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటకకు చెందిన 595 లీటర్ల మద్యం, 254 లీటర్ల నాటుసారా, 148 లీటర్ల డీపీఎల్ మద్యాన్ని శనివారం పాత హంద్రీ బ్రిడ్జిపై ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ మంజుల తెలిపారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు రూ.2లక్షల మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు.

రేపు అనంతపురంలో వ్యవసాయ అధికారుల బదిలీలు



కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో మండల వ్యవసాయ అధికారులు, సహాయ సంచాలకులు, సీనియర్ అసిస్టెంట్లు, సూపరిటెండెంట్లు, పరిపాలన అధికారుల బదిలీల ప్రక్రియ జోనల్ స్థాయిలో సోమవారం అనంతపురంలో జరుగనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మండల వ్యవసాయ అధికారుల్లో ఒకే స్టేషన్‌లో ఐదేళ్లు పైబడి పని చేస్తున్న వారు 32 మంది ఉన్నారు. ఏడీఏల్లో ఒకరు లాంగ్ లీవ్‌లో ఉన్నారు. ఒకే స్టేషన్‌లో ఐదేళ్లు పైబడి పని చేస్తున్న వారు ఆరుగురు ఉన్నారు. వీరందరు బదిలీ కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం రిక్వెస్ట్‌పై జీరో సర్వీస్ ఉన్న వారు కూడా బదిలీకి అర్హులేనని ప్రకటించడంతో వ్యవసాయ శాఖలో బదిలీల జాతర నెలకొంది. జిల్లాలో కల్లూరు, ఆదోని, ఎమ్మిగనూరు మండలాలకు గతంలో ఎప్పుడూ లేని పెద్ద ఎత్తున పైరవీలు నడుస్తున్నాయి. ఇప్పటికే కూటమి పార్టీల నేతలను ముడుపులతో ప్రసన్నం చేసుకుని లైన్ క్లియర్ చేసుకున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సిఫార్స్ లేఖలతో దరఖాస్తులు చేసుకున్నారు. లేఖలతో పాటు ఫోన్‌లు కూడా చేయించుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సోమవారం బదిలీలకు శ్రీకారం చుట్టనున్నారు. రాయలసీమ జిల్లాల్లో అనంతపురం డీఏఓ సీనియర్ కావడంతో అక్కడ అడిషినల్ డైరెక్టర్ కృపానందం ఆధ్వర్యంలో బదిలీలు చేపట్టనున్నారు.



గుడికంబాళి రీచ్‌లో ట్రాక్టర్లకు ఇసుక నింపుతున్న దృశ్యం

తోడుకున్నోడికి తోడుకున్నంత!



హాల్వి బండమెట్టతో ఆగిన ఇసుక ట్రాక్టర్లు

కూటమి నేతల ఆశీస్సులు ఉంటే చాలు.. అనుమతులతో పనిలేదు. చలానాలు అసలే అక్కర్లేదు. తోడుకున్నోడికి తోడుకున్నంత. ఇదీ కౌతాళం మండలం గుడికంబాళి గ్రామ సమీపంలో ప్రభుత్వ ఇసుక రీచ్‌లోని దుస్థితి. ఇటీవల నదికి వరద నీరు రావడంతో అక్కడ అధికారికంగా ఇసుక రవాణాకు అనుమతులిచ్చారు. ఇదే అదునుగా చేసుకున్న కూటమి అనుకూల ట్రాక్టర్ల యజమానులు నదిలో వాలిపోయారు. తోడేళ్లుగా మారి ఇసుకనంతా తరలిస్తున్నారు. తమ ఆదాయ వనరుగా మార్చుకుని రీచ్‌లో అడ్డంకులకు తావు లేకుండా ఇసుకను దాటిస్తున్నారు. శనివారం గుడికంబాళి రీచ్ నుంచి వందలాది ట్రాక్టర్ల ఇసుక అక్రమంగా తరలిపోతున్నా ఏ ఒక్క అధికారి అటు వైపు తొంగి చూడలేదు.

– మంత్రాలయం